బీఆర్‌ఎస్‌కు 75 సీట్లు

▸ మొదటిపేజీ తరువాయి...

మరోసారి సారు.. కారు... సర్కారు ప్రభంజనం పునరావృతం కా బోతున్నదని స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీకి 31-36 సీట్లు మాత్రమే వస్తాయని తేలింది. అంటే కాంగ్రెస్‌తో పోల్చితే బీఆర్‌ఎస్‌కు రెట్టింపు సీట్లు వస్తుండటం గమనార్హం. ఇక బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కానున్నది. ఈ పార్టీకి 4-6 సీట్లు మాత్రమే వస్తాయని సర్వేలో వెల్లడైంది. ఎంఐఎంకు 6-7 సీట్లు వస్తాయని సర్వే పేర్కొన్నది. ఓట్ల శాతం పరంగా గమనిస్తే... అత్యధిక ఓటర్లు బీఆర్‌ఎస్‌కు జై

కొట్టారు. బీఆర్‌ఎస్ అత్యధికంగా 41 శాతం ఓట్లను దక్కించుకోనున్నదని సర్వేలో తేలింది. కాంగ్రెస్ పార్టీకి 34 శాతం ఓట్లు వస్తాయని వెల్లడైంది. ఎంఐఎంకు 3 శాతం, బీజేపీకి 14 శాతం, ఇతరులకు 8 శాతం ఓట్లు వస్తాయని సర్వే పేర్కొన్నది.

కేసీఆర్‌కు సాటి రాగల లీడర్ లేడు

జనతా కా మూడ్ సర్వేలో మరో ఆసక్తికరమైన అంశం వెల్లడైంది. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌కు సాటి రాగల మరో లీడర్ లేరని ప్రజలు అభిప్రాయపడ్డారు. కేసీఆర్‌కు దీటైన నాయకత్వం ఇతర పార్టీల్లో కనిపించడం లేదని తెలిపారు. కేసీఆర్ పాలనపై ప్రజలు అత్యధిక విశ్వాసాన్ని చూపుతున్నట్టు తేలింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతు, మహిళా, బీసీల సంక్షేమ పథకాలపై ఎంతో సంతోషంగా ఉన్నట్టు ప్రజలు తెలిపారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలు మోదీ సర్కారుకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై నమ్మకం లేదు

ప్రజలు కాంగ్రెస్‌ను ఇప్పటికీ నమ్మడం లేదని సర్వేలో తేలింది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, నాయకత్వలేమిపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. నాయకులు మధ్య కొట్లాటలకే సరిపోతున్నదని, ఇక తమ సంక్షేమాన్ని, ఇబ్బందులను పట్టించుకునే పరిస్థితి లేదని అభిప్రాయపడ్డారు. దీనికి తోడు కాంగ్రెస్ ఇస్తున్న హామీలపై ప్రజలు నమ్మకం చూపడం లేదని తేలింది. ఇందుకు కారణం కర్ణాటకలో అధిక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అక్కడ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ప్రజలు అభిప్రాయపడ్డారు. ఇక్కడ కూడా ఇదే విధంగా జరుగుతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటుందనే నమ్మకం లేదని తేల్చి చెప్పారు. అయితే ప్రజలు బీఆర్‌ఎస్ ఇచ్చే హామీలపై నమ్మకం వ్యక్తం చేస్తున్నట్టు సర్వేలో తేలింది.

సర్వే ఫలితాలను వెల్లడిస్తున్న జనతా కా మూడ్ వ్యవస్థాపకుడు భాస్కర్‌సింగ్

పార్టీల వారిగా గెలిచే అవకాశమున్న సీట్ల సంఖ్య

పార్టీ	సీట్లు
బీఆర్‌ఎస్	72-75
కాంగ్రెస్	31-36
ఎంఐఎం	6-7
బీజేపీ	4-6

పార్టీలవారీగా లభించే ఓట్ల శాతం

పార్టీ	ఓట్ల శాతం
బీఆర్‌ఎస్	41
కాంగ్రెస్	34
ఎంఐఎం	03
బీజేపీ	14
ఇతరులు	08

రెక్కలు రాలుతున్న కమలం

బీజేపీలో రోజూ రాజీనామాల పర్వం
తాజాగా తప్పుకున్న వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. ఎన్నికల వేళ సభలు, సమావేశాలు అంటూ హడావుడి జరగాల్సిన సమయంలో రోజుకో నాయకుడు పార్టీని వీడుతున్నారు. ఈ రాజీనామల పర్వంలో తాజాగా జీ వివేక్ వెంకటస్వామి చేరారు. బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న వివేక్ పార్టీకి రాజీనామా చేసి, వెంటనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కూడా పార్టీకి రాంరాం చెప్పారు. వరంగల్ జిల్లాకు చెందిన రాకేశ్ వరంగల్ వెస్ట్ నుంచి పోటీ చేయాలని భావించారు. టికెట్ కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించారు. కానీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు రావు పద్మకు టికెట్ దక్కింది. దీంతో రాకేశ్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అందరూ ఊహించినట్టుగానే ఆయన బీజేపీకి రాజీనామా చేశారు. బీజేపీలో విలువలు కనిపించడం లేదని, కొందరి చేతిలో పార్టీ బందీ అయ్యిందని ఆరోపించారు. మూడేండ్లుగా తనను వ్యక్తిగతంగా వేధించారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారని, అయినా పార్టీ పట్టించుకోలేదని వాపోయారు. జితేందర్‌రెడ్డి కుమారుడికి టికెట్ ఇవ్వడం ద్వారా పార్టీలో వారసత్వ రాజకీయాలు, డబ్బు రాజకీయాలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. యువతను ధర్మం, సిద్ధాంతాల పేరుతో బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు.

వివేక్.. వీసిక్స్.. ఫిక్స్

సీనియర్ నేత వివేక్ వెంకటస్వామి బీజేపీని విడిచి కాంగ్రెస్‌లో చేరడంపై సోషల్ మీడియాలో సెటైర్ల వర్షం కురుస్తున్నది. ఆయన ఆరుసార్లు పార్టీ మారడాన్ని ప్రస్తావిస్తూ నెటిజన్లు ఆడుకుంటున్నారు. మూడుసార్లు కాంగ్రెస్‌లో, రెండుసార్లు బీఆర్‌ఎస్‌లో చేరారంటూ ఎద్దేవా చేస్తున్నారు. 'ఆయన మీడియా సంస్థకు వీ6 అనే పేరు ఎందుకు పెట్టారో తేలిపోయింది. వివేక్ ఆరు సార్లు పార్టీ మారుతారనే అర్థం వచ్చేలా ముందే పేరుపెట్టారు' అంటూ ఎద్దేవా చేస్తున్నారు. బీజేపీలో ఆయన మ్యానిఫెస్టో కమిటీ అధ్యక్షుడిగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. 'కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరిన బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ అధ్యక్షుడు' అంటూ సెటైర్లు వేస్తున్నారు. 'మ్యానిఫెస్టోను బీజేపీ ఒకటికి రెండుసార్లు చెక్‌చేసుకోవాలి. ఎందుకంటే పోతూపోతూ ఏం రాశాడో తెల్వదు' అని కౌంటర్లు వేస్తున్నారు.

కొండా.. అలక?

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీ పెద్దలపై అలిగినట్టు సమాచారం. పొత్తులో భాగంగా తమకు శేరిలింగంపల్లి, చేవెళ్ల అసెంబ్లీ స్థానాలు కావాలని జనసేన కోరుతున్నది. ఈ రెండు టికెట్లు ఇవ్వడానికి బీజేపీ దాదాపు సిద్ధమైంది. దీంతో తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక్క టికెట్ జనసేనకు ఇచ్చినా పార్టీకి రాజీనామా చేస్తానని కొండా అల్టిమేటం జారీ చేసినట్టు సమాచారం. దీంతో పొత్తులపై చర్చలు మళ్లీ మొదటికి వచ్చాయని నేతలు చెప్పుకుంటున్నారు.

బరాజ్‌లపై బరితెగింపు ప్రచారం!

- ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం
- సోషల్ మీడియా టీంతో ప్రత్యేక ఫోకస్
- మసిపూసి మాయ చేస్తున్న విపక్షాలు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌లో ఒక్క పిల్లర్ కుంగిన ఉదంతాన్ని సాకుగా తీసుకొని 'అదిగో పులి.. ఇదిగో తోక' అన్న చందంగా విపక్షాలు మిగిలిన బరాజ్‌లపై కూడా బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. కేంద్రం ప్రభుత్వం ఒక్కపైసా ఇవ్వకున్నా సీఎం కేసీఆర్ స్వరాష్ట్ర నిధులతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా ఉన్న వివిధ బరాజ్‌లు, పంప్‌హౌస్‌ల నిర్మాణాలను ఎల్‌అండ్‌టీ, ఆఫ్కాన్, మేఘా, సీ5 వంటి కంపెనీలకు అప్పగించారు. ఆయా బరాజ్‌లను నిర్మించడంతోపాటు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. ఐదు నుంచి 15 ఏండ్లపాటు వాటి మెయింటెనెన్స్ బాధ్యత కూడా ఆ కంపెనీలదే. ఈ నేపథ్యంలో ఆయా సంస్థలు తమ అధీనంలోని బరాజ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. ఎక్కడైనా లోపాలుంటే వాటిని సరిచేయడం వాటి విధి. అందులో భాగంగానే అన్నారం బరాజ్ వద్ద జరుగుతున్న మెయింటెనెన్స్ పనులను చూసి ఇక్కడ కూడా ఏదో ఘోరం జరిగిపోతున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు వండి వార్చుతున్నారు.

అన్నారం బరాజ్ వద్ద మెయింటెనెన్స్ పనులు చేస్తున్న సిబ్బంది

అన్నారం వద్ద ఏం జరిగింది?

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం(సరస్వతి) బరాజ్ వద్ద అధికారులు ప్రతీ సంవత్సరం మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తుంటారు. నిర్మాణ సంస్థల నిపుణులు ఏడాదికోసారి గేట్ల వద్ద వరదలు తగ్గాక బరాజ్‌ను సంపూర్ణంగా పరిశీలిస్తారు. ఇది నిత్యం జరిగే పనే. సరస్వతి బ్యారేజీని 66 పిల్లర్లతో, 64 గేట్లతో 1.2 కిలోమీటర్ల పొడవున 10.87 టీఎంసీల సామర్థ్యంతో ఆఫ్కాన్ కంపెనీ నిర్మించింది. ఐదేండ్ల పాటు ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత ఆఫ్కాన్ కంపెనీదే. ఎప్పటిమాదిరిగానే సరస్వతీ బరాజ్‌లో స్టోన్, మెటల్, ఇసుకతో రింగ్‌బండ్ చేపట్టి మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తుండగా బయటకు వచ్చే నీటిని చూసి బుంగ పడిందని సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని అధికారులు స్పష్టం చేశారు.

ప్రాజెక్టులకు ఢోకా లేదు

కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీబరాజ్, సరస్వతి బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌లకు ఎలాంటి ఢోకా లేదని అధికారులు తెలిపారు. ఆయా బరాజ్‌లను నిర్మించిన వివిధ కంపెనీలకు వాటి నిర్వహణ బాధ్యత ఐదేండ్ల నుంచి 15 ఏండ్ల వరకు ఉన్నదని పేర్కొన్నారు. సరస్వతీ బరాజ్‌ను నిర్మించిన ఆఫ్కాన్ కంపెనీ ఐదేండ్లపాటు, లక్ష్మీబరాజ్‌ను నిర్మించిన ఎల్‌అండ్‌టీ కూడా ఐదేండ్లు వారెంటీ పీరియడ్ ఉందని తెలిపారు. ఇక కన్నెపల్లి పంప్‌హౌస్ మేఘా కంపెనీ నిర్మించగా వారికి 15 ఏండ్లు, గ్రావిటీ కెనాల్‌ను సీ5 కంపెనీ నిర్మించగా వారికి సైతం 15ఏండ్ల వారెంటీ పీరియడ్ ఉన్నదని తెలిపారు. ప్రాజెక్టు నిర్మించే ముందు 40 ఏండ్ల వరద పరిస్థితిని అధ్యయనం చేసి డిజైన్ చేశారని అధికారులు వివరించారు. అయితే అంచనాకు మించి 2022లో కురిసిన వర్షాలతో 119.2 మీటర్ల ఎత్తుతో వరదలు వచ్చాయని, పంప్‌హౌస్‌లోకి నీరు చేరడం మినహా ప్రాజెక్టుకు ఎలాంటి హానీ జరుగలేదని అన్నారు. పంప్‌హౌస్ నీటిలో మునగగా మేఘా కంపెనీ మరమ్మతు చేపట్టి మళ్లీ రన్ చేస్తున్నదని వివరించారు.

ఎలాంటి సమస్యా లేదు

సరస్వతి బరాజ్ వద్ద ఎలాంటి సమస్యా లేదు. ఇలాంటి ప్రచారం ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. ప్రతి సంవత్సరం మాదిరిగానే బరాజ్ వద్ద వరదలు తగ్గిన తర్వాత మెయింటెనెన్స్ పనులు నిర్వహించడం సహజం. 2022లో వరదలు వచ్చినప్పటి నుంచి అలర్ట్‌గా ఉన్నాం. బరాజ్ వద్ద స్టోన్ డంపింగ్, మెటల్ డంపింగ్, సాండ్ బ్యాగులతో బండ్ ఏర్పాటు చేసి మెయింటెనెన్స్ పనులు కొనసాగిస్తుంటాం. ఎప్పుడూ ఇది జరిగేదే.

- యాదగిరి, నీటి పారుదల శాఖ ఈఈ (సరస్వతి బరాజ్)

హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో ఏనుగు రాకేశ్‌రెడ్డి

బీజేపీకి బిగ్ షాక్!

- ఆ పార్టీ నేత రాకేశ్‌రెడ్డి రాజీనామా
- పొమ్మనలేక పొగబెట్టారని ఆవేదన
- కడియం శ్రీహరితో చర్చలు

హనుమకొండ, నవంబర్ 1: భారతీయ జనతా పార్టీకి మరో షాక్ తగిలింది. బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నుంచి టికెట్ ఆశించగా, అధిష్ఠానం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు కేటాయించడంతో రాకేశ్‌రెడ్డి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం తన అనుచరులతో కలిసి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో మీడియా సమావేశంలో రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. టిక్కెట్ రాకపోవడంతో భావోద్వేగానికి గురైన ఆయన పొమ్మనలేక పొగపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తపనతో ఉన్నత ఉద్యోగాన్ని వదిలి బీజేపీలో చేరిన తాను 11 ఏండ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్నందుకు బాధగా ఉన్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న తనను ఎన్నోసార్లు అవహేళన చేయడమే కాకుండా జిల్లా కార్యాలయంలో అడుగు పెట్టకుండా అడ్డుకున్నారని వాపోయారు. సర్వేల ఆధారంగా టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ జాతీయ నాయకులు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వేలకోట్ల అధిపతి కొడుకు కాబట్టే రెండో జాబితాలో జితేందర్‌రెడ్డి కుమారుడికి టికెట్ ఇచ్చారని, ఒక రైతు బిడ్డను కాబట్టే తనకు టికెట్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సిద్ధాంతాలు, మ్యానిఫెస్టోలు లేని పార్టీ అని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు సీట్లు కూడా గెలువబోదన్నారు. అనుచరులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. కాగా, రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనుచరులతో మాట్లాడి నిర్ణయం ప్రకటిస్తానని కడియంకు చెప్పినట్టు రాకేశ్‌రెడ్డి తెలిపారు.

• నందిని దాస్‌కు బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్

లండన్, నవంబర్ 1: భారత సంతతికి చెందిన రచయిత్రి నందిని దాస్ ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ అకాడమీ బుక్ ప్రైజ్‌కు ఎంపికయ్యారు. 2023 ఏడాదికి గానూ ఆమెను ఈ అవార్డుకు ఎంపికచేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నందిని దాస్ ప్రపంచ సాంస్కృతిక అవగాహనను పెంచేలా రచించిన 'కౌంటింగ్ ఇండియా: ఇంగ్లండ్, మొఘల్ ఇండియా అండ్ ఆరిజన్స్ ఆఫ్ అంపైర్' కు ఈ ప్రైజ్ లభించింది. మంగళవారం లండన్‌లోని బ్రిటిష్ అకాడమీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమెకు ఈ బహుమతిని అందజేశారు.

• 'క్రీడా' విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షలు: సీబీఎస్‌ఈ

న్యూఢిల్లీ, నవంబర్ 1: దేశ, విదేశాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లే విద్యార్థులకు పరీక్షల విషయంలో వెసులుబాటు కల్పిస్తూ సీబీఎస్‌ఈ కీలక ప్రకటన చేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలు లేదా ఇంటర్నేషనల్ ఒలంపియాడ్స్‌లో పాల్గొనే 10, 12వ తరగతి విద్యార్థులకు 2024 బోర్డు పరీక్షల షెడ్యూల్ తర్వాతి తేదీల్లో ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నది. ఈ విధానం క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు అటు క్రీడాపరంగా, ఇటు విద్యాపరంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది.

• బంగారు సింహాసనంపై అయోధ్య రాముడు!

అయోధ్య, నవంబర్ 1: దాదాపు 8 అడుగుల ఎత్తైన బంగారు పూత పూసిన పాలరాయి సింహాసనంపై రామ్‌లల్లా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని శ్రీ రామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. ఈ సింహాసనం మూడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పు ఉంటుందని పేర్కొంది. రాజస్థాన్‌లో తయారవుతున్న ఈ సింహాసనం వచ్చే నెల 15 నాటికి అయోధ్యకు చేరుకుంటుందని తెలిపింది. గర్భగుడి నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయని వెల్లడించింది.

ఓటు కోసం 10.42 లక్షల దరఖాస్తులు

- కొత్త ఓటుహక్కుకు ముగిసిన దరఖాస్తు గడువు
- 10 కల్లా పరిశీలన, సిద్ధం కానున్న ఓటరు జాబితా

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): సాధారణ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఓటు హక్కు కోసం 10.42 లక్షలు దరఖాస్తులు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన అక్టోబర్ 9 నుంచి 31వ తేదీ వరకు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిశీలన, ఈ నెల 10 కల్లా ఓటరు జాబితాను తయారు చేయనున్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ చేసి అక్టోబర్ 4న జాబితాను ప్రచురించింది. తెలంగాణలో మొత్తం 3.17 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా ఓటు హక్కు కోసం 10.42 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

కొత్తగా ఓటు హక్కు పొందిన వారందరికీ ఎన్నికల సంఘం ఉచితంగా ఓటరు కార్డును అందించనున్నది. అర్హులైన ఓటర్లకు పోస్టు ద్వారా ఓటరు కార్డును పంపించనున్నది. దీంతోపాటు ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఓటరు కార్డును డిజి లాకర్‌లోనూ భద్రపర్చుకునే అవకాశాన్ని సైతం కల్పించారు. ప్రింట్ తీసుకునే వెసులుబాటు కూడా ఉన్నది. ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకునే సందర్భంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఓటరు జాబితాలోని పోలింగ్ స్టేషన్, సీరియల్ నంబర్, పోలింగ్ తేదీ వాటితో క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ఇస్తారు. https://voterportal.eci.gov.in/login లేదా https://nvsp.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితోపాటు ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటరు పోర్టల్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఓటరు కార్డు నంబర్ లేదా ఫారం రిఫరెన్స్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. ఆ తరువాత ఓటరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఓటరు కార్డు ప్రత్యేకతలు ఇవే

కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు కార్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. బంగారు వర్ణంలో ఉండేలా తయారు చేశారు. ఈ కార్డును పీవీసీ షీట్ పై కలర్ ఫొటోను ముద్రించి ఇస్తున్నారు. ఓటరు కార్డుకు ఐఎస్‌వో గుర్తింపు కూడా లభించింది. 760 మైక్రాన్స్ మందంతో కార్డును తయారు చేశారు. కార్డును 86X54X0.76 మిల్లీ మీటర్ల సైజులతో ముద్రించారు. ఈ కార్డును ఎన్నికల సంఘం కొత్తగా నమోదు అయ్యేవారికి, చిరునామా మార్చుకున్న వారికి, ఓటరు వివరాలను మార్చుకున్న వారికి ఇంటికే కార్డును పంపిస్తున్నారు. ఓటరు కార్డు ముందు భాగంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా పేరు, భారతదేశ రాజముద్ర, ఓటరు కార్డు నంబర్, నంబర్ కింద భాగంలో ఓటరు ఫొటో ఉంటుంది. ఫొటో పక్కన ఓటరు పేరు, తండ్రి లేదా భర్త పేరు, పురుషులు లేదా స్త్రీలు, పుట్టిన తేదీ వివరాలను ముందు భాగంలో నమోదు చేశారు. వెనుక భాగంలో ఓటరు సంతకం, క్యూఆర్ కోడ్, ఓటరు కార్డు నంబర్, చిరునామా, ఓటరు కార్డు జారీ చేసిన తేదీని ముద్రించారు. ఓటరు కార్డుపై హోలో గ్రామ్‌ను ముదిస్తారు. హోలో గ్రామ్‌లో మోషన్ ఎఫెక్ట్, మల్టీ చానల్స్ ఎఫెక్ట్, ట్రూ కలర్ ఎఫెక్ట్, గ్రాడియెంట్ ఎఫెక్ట్స్ ఉంటాయి. మైక్రో సెక్యూరిటీ ఫీచర్స్, ఫోరెన్సిక్ పరంగా నానో సెక్యూరిటీ ఫీచర్స్‌ను ఏర్పాటు చేశారు. హోలో గ్రామ్‌కు సీరియల్ నంబర్ ఉంటుంది.

ఆ ఆరుగురికీ సోమేశ్ తీర్పే!

- హైకోర్టుకు కేంద్రం నివేదన

హైదరాబాద్, నవంబర్ 1, (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కొనసాగుతున్న ఆరుగురు కేంద్ర సర్వీస్ అధికారుల బదిలీ విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్ కేసులో వెలువరించిన తీర్పునే అమలు చేయాలని కేంద్రం హైకోర్టును కోరింది. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యూష్ కుమార్ సిన్హా కమిటీ సిఫార్సుల మేరకు ఏపీ, తెలంగాణలకు ఐఏఎస్, ఐపీఎస్ వంటి కేంద్ర సర్వీస్ అధికారులను విభజించారు. అయితే ఆ సిఫార్సులను పలువురు కేంద్ర సర్వీస్ అధికారులు క్యాట్‌లో సవాల్ చేసి మధ్యంతర ఉత్తర్వులతో తెలంగాణలో కొనసాగుతున్నారు. క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కేంద్రం హైకోర్టులో వేర్వేరు అప్పీళ్లను దాఖలు చేసింది. వీటిని బుధవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బీ నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. డీజీపీ అంజనీకుమార్, సహా ఆరుగురు కేంద్ర సర్వీస్ అధికారులు రోనాల్డ్ రాస్, జే అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి, అభిలాస్‌బిస్లకు సోమేశ్‌కుమార్ కేసులో ఇచ్చిన తీర్పును వర్తింపజేయాలని కోరారు. మిగిలిన పిటిషన్లలో మాత్రం వ్యక్తిగతమైన అంశాలు ఉన్నందున వాటిపై వాదనలు వినిపిస్తామన్నారు. స్పందించిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తున్నామని, అప్పటిలోగా ప్రతివాదులు తమ వాదనలను లిఖితపూర్వకంగా నివేదించాలని ఆదేశించింది.

బాబుకు మరిన్ని షరతులు విధించాలి

ఏపీ హైకోర్టులో సీఐడీ పిటిషన్

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): బెయిల్‌పై విడుదలైన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు మరిన్ని షరతులు విధించాలని కోరుతూ ఏపీ సీఐడీ బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబు ఎటువంటి పత్రికా సమావేశాలు నిర్వహించకుండా నిలువరించాలని, రాజకీయ ర్యాలీల్లో పాల్గొనకుండా చూడాలని, ఆయన రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించి హైకోర్టుకు నివేదికలు ఇచ్చేలా ఇద్దరు డీఎస్పీలకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. ఈ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని కోర్టు చంద్రబాబు తరఫు న్యాయవాదులకు సూచించింది. బాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తీసుకోలేదని అదనపు అటార్నీ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించగా, దీనిపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కోర్టు ముందున్న వివరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తాము మధ్యంతర బెయిల్ మంజూరు చేశామని స్పష్టం చేసింది. దీనిపై ఏవైనా అభ్యంతరాలుంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని చెప్పింది.

హైదరాబాద్‌కు చేరుకున్న చంద్రబాబు

చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరితో కలిసి బుధవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయం వద్ద ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. కాగా, చంద్రబాబును ఆయన నివాసంలో ఏఐజీ బృందం కలిసింది. వైద్యుల సూచన మేరకు గురువారం ఉదయం పది గంటలకు చంద్రబాబు ఏఐజీ దవాఖానకు వెళ్లనున్నారు.

ఆ సొమ్మును అభ్యర్థుల వ్యయంలో కలపండి

- పట్టుబడుతున్న తాయిలాలు, బహుమతులపై సీఈసీ ఆదేశం
- రాష్ట్ర ఎన్నికల అధికారుల బృందంతో సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : తనిఖీలలో భాగంగా పట్టుబడుతున్న ఎన్నికల తాయిలాలు, బహుమతులను ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖర్చులోనే కలపాలని కేంద్రం ఎన్నికల బృందం రాష్ట్ర సీఈవోను ఆదేశించింది. నగదు విషయంలో సాక్ష్యాధారాలుంటే ఉదాసీనంగా వ్యవహరించాలని స్పష్టంచేసింది. అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల తరలింపును అడ్డుకోవడానికి ఆధునిక పద్ధతుల్లో ఆలోచించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు సూచించింది. నామినేషన్ల స్వీకరణకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం పనితీరుపై కేంద్రం ఎన్నికల సంఘం అధికారుల బృందం మరోసారి సమీక్షించింది. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 1950, సువిధ, సీ-విజిల్, ఈఎమ్‌ఎమ్‌సీ పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఇప్పటికే ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఓటర్ల జాబితా తుది సవరణల తర్వాత పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ఓటరు కార్డుల పంపిణీ, ఓటర్ల సమాచార స్లిప్‌ల విషయంలో తాజా పరిస్థితిని బృందం అధికారులు అడిగి తెలుసుకొన్నారు. ఎంసీఎంసీ సర్టిఫికెట్‌లను రోజువారీగా జారీచేయాలని ఆదేశించారు. కీలక పోలింగ్‌కేంద్రాల్లో నిఘా కెమెరాల ఏర్పాటు పరిస్థితిని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్రశర్మ, నితేశ్‌కుమార్ వ్యాస్, ప్రిన్సిపల్‌సెక్రటరీ అవినాశ్‌కుమార్ అడిగి తెలుసుకొన్నారు. ఇంటి వద్ద నుంచే ఓటు వేయాలనుకొనే సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగుల ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్దేశిత ఫారాలను ముందుగానే అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, ఎస్‌సీఎస్ సునీల్ శర్మ, రవాణా ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, ఏడీజీపీ, ఎన్నికల వ్యవయ పరిశీలన నోడల్ అధికారి మహేశ్ భాగవత్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్ జైన్, వివిధ పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, నవంబర్ 1: భారత నావికాదళం బ్రహ్మోస్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతంలోని ఒక యుద్ధ నౌక నుంచి ఈ క్షిపణిని పరీక్షించామని, నిర్దేశిత లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్టు నావికాదళం ప్రతినిధి బుధవారం తెలిపారు.

సికింద్రాబాద్‌కు రెండు వందే సాధరణ రైళ్లు

హైదరాబాద్, సిటీబ్యూరో, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : దేశ వ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న వందే సాధరణ రైళ్లలో భాగంగా సికింద్రాబాద్ నుంచి రెండు రైళ్లను ప్రారంభించనున్నారు. కేంద్ర రైల్వే శాఖ ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

తిరుపతి-హౌరా వన్‌టైమ్ ప్రత్యేక రైలు

ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో తిరుపతి-హౌరా రైల్వే స్టేషన్ల మధ్యలో వన్‌టైమ్ ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తూ బుధవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నాలుగు రైళ్లు పునరుద్ధరణ..

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో నాలుగు రైల్వే స్టేషన్ల మధ్యలో నిలిచిపోయిన నాలుగు రైళ్లను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 2 నుంచి దాండ్-నిజామాబాద్, నిజామాబాద్-పూణే, నిజామాబాద్-పందాపూర్ స్టేషన్ల మధ్య రైళ్ల పునరుద్ధరణ ఉంటుందని తెలిపారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

- రాజీయే రాజమార్గం

నాంపల్లి కోర్టులు, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 9వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సారి అధిక కేసుల పరిష్కారానికి హైదరాబాద్ న్యాయ సేవాధికార సంస్థ సన్నద్ధం చేస్తున్నది.

ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

రైల్వే నిలయంకు అవార్డు

హైదరాబాద్, సిటీబ్యూరో : దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు ప్రధాన కార్యాలయమైన సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయానికి గోల్డ్ రేటింగ్‌ను ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సెల్ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం రేటింగ్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్‌ను ఎస్‌సీఆర్ జీఎం అందుకున్నారు.